# ఇండియన్ పాలిటీ

## కేంద్ర దర్యాప్తు సంస్థ

భారతదేశంలో ప్రజాజీవితంలోని అవినీతి, ఆర్థిక, వ్యవస్థీకృత నేరాలు, వివిధ న్యాయస్థానాల్లో ఉన్న కేసులను పరిశోధించే అత్యున్నత వ్యవస్థ కేంద్ర దర్యాప్తు సంస్థ (Central Bureau of Investigation). ఇది తన పనితీరుకు సంబంధించి అన్ని విభాగాల్లోనూ వృత్తి నైపుణ్యాలను, సమర్థతను ప్రదర్శిస్తూ కీలకమైన కేసులను ఛేదిస్తుంది.

అవినీతి నిర్మూలనపై అధ్యయనం చేసిన సంతానం కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ చేసిన తీర్మానం ఆధారంగా 1963, ఏప్రిల్ 1న సీబీఐ ఏర్పడింది. ఇది చట్టబద్ధ సంస్థ కాదు. దిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1946 అందించిన అధికారాలతో సీబీఐ పనిచేస్తుంది. దీని పరిధి కేంద్రపాలిత ప్రాంతాలపైన, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో ఆయా రాష్ట్రాలపై కూడా విస్తరించింది.

### ఉద్దేశం - లక్ష్యాలు

**ఉద్దేశం:** శ్రమశీలత, నిష్పాక్షికత, నైతికవర్తన

**లక్ష్యాలు:** సమగ్రమైన దర్యాప్తు, శాస్త్రీయతతో కూడిన విజయవంతమైన నేరవిచారణల ద్వారా రాజ్యాంగ చట్టాలను అమలుపరచడం. పోలీసు దళాలకు మార్గదర్శకాన్ని అందించడం. వివిధ రకాల చట్టాలను సమర్థంగా, వేగంగా అమలు చేసే విషయంలో జాతీయ, అంతర్జాతీయ సహకారానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరించడం.

### నిర్మాణం

- ✦ సంచాలకుడి (డైరెక్టర్) నేతృత్వంలో సీబీఐ పనిచేస్తుంది. ఇతడికి సహకరించేందుకు అడిషనల్ డైరెక్టర్, అనేక మంది జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్, పోలీసు సూపరింటెండెంట్స్, వివిధ హోదాల్లో ఇతర పోలీసు సిబ్బంది ఉంటారు.
- ✦ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ అధ్యక్షతన గల కమిటీ సిఫార్సుల మేరకు సీబీఐ డైరెక్టర్‌ను కేంద్రప్రభుత్వం నియమిస్తుంది.
- ✦ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ చట్టం, 2003 ప్రకారం సీబీఐ డైరెక్టర్ పదవీకాలం రెండు సంవత్సరాలు.
- ✦ దిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా సీబీఐ డైరెక్టర్ హోదాలో ఉన్న వ్యక్తి సంస్థ పాలనా వ్యవహారాలకు బాధ్యత వహిస్తారు.
- ✦ 2003 నాటి సీవీసీ చట్టం ప్రకారం దిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ను పర్యవేక్షించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

### ఇంటర్‌పోల్‌కు ప్రతినిధిగా..

సీబీఐ భారతదేశంలో ఇంటర్‌పోల్ సంస్థకు 'నేషనల్ సెంట్రల్ బ్యూరో'గా వ్యవహరిస్తుంది. దేశంలో చట్టాలను అమలు చేసే సంస్థలకు, ఇంటర్‌పోల్ సభ్యదేశాలకు వాటి అభ్యర్థన మేరకు దర్యాప్తు చేస్తూ సంబంధిత కార్యకలాపాలను సమన్వయపరుస్తుంది.

### సీబీఐ Vs స్టేట్ పోలీస్

సీబీఐలో ఒక విభాగమైన స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (SPE) సీబీఐకి అనుబంధంగా పనిచేస్తుంది. రాష్ట్ర పోలీసు బలగాలతోపాటు SPE కి కూడా దిల్లీ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1946 ప్రకారం ఉమ్మడి అధికారాలున్నాయి. అయితే ఒకే కేసుపై రెండు సంస్థలు ఒకేపని చేయడాన్ని నియంత్రించేందుకు కొన్ని పరిపాలనా పరమైన సవరణలు చేశారు. అవి:

- ★ SPE కేవలం కేంద్రప్రభుత్వ వ్యవహారాలు లేదా ఉద్యోగులకు సంబంధించిన కేసులను మాత్రమే తీసుకోవాలి. (కొంతమంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉన్నప్పటికీ దానిలో జోక్యం చేసుకోరాదు.)
- ★ రాష్ట్ర పోలీసులు కేవలం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలు లేదా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కేసులను మాత్రమే తీసుకోవాలి. (కొంతమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉన్నప్పటికీ దానిలో జోక్యం చేసుకోరాదు.)
- ★ SPE ప్రభుత్వరంగ సంస్థలు లేదా కేంద్రం ఏర్పాటు చేసి నిధులందిస్తున్న సంస్థల ఉద్యోగులపై కేసులను నమోదు చేసి, దర్యాప్తును చేపట్టవచ్చు.

## సీబీఐ అకాడమీ

- సీబీఐ సిబ్బంది శిక్షణా కార్యక్రమాలను ప్రారంభంలో న్యూదిల్లీలోని సీబీఐ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించేవారు.
- సీబీఐ సిబ్బందికి మెరుగైన శిక్షణను ఇచ్చే లక్ష్యంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో సీబీఐ అకాడమీని 1996లో ఏర్పాటు చేశారు.
- నేరాల దర్యాప్తు, విచారణ, నిఘా రంగాల్లో సమగ్రమైన శిక్షణ, అత్యాధునిక సాంకేతికతతో సీబీఐ అకాడమీలో శిక్షణ అందిస్తున్నారు.
- సీబీఐ అకాడమీ శిక్షణ ప్రాంతీయ కేంద్రాలను ముంబయి, చెన్నై, కోల్‌కతాలో నెలకొల్పారు.

సీబీఐ అకాడమీలో రెండు రకాల శిక్షణా కోర్సులను నిర్వహిస్తున్నారు. అవి:

**స్వల్పకాలిక ఇన్‌సర్వీస్ కోర్సులు:** ఇందులో సీబీఐ, రాష్ట్ర పోలీసులు, సెంట్రల్ పారామిలటరీ దళాలకు చెందిన అధికారులకు శిక్షణ ఇస్తారు.

**దీర్ఘకాలిక ప్రాథమిక కోర్సులు:** ఇందులో నేరుగా నియమితులైన సీబీఐ సిబ్బంది అంటే పోలీస్ సూపరింటెండెంట్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లకు శిక్షణ ఇస్తారు.

## విధులు

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు.
- ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి వివిధ చట్టాల ఉల్లంఘనకు సంబంధించిన కేసులు అంటే ఎగుమతి, దిగుమతుల నియంత్రణ, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కమ్‌ట్యాక్స్, విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టాలను ఉల్లంఘించిన కేసుల దర్యాప్తు. అయితే ఇలాంటి కేసులను సంబంధిత శాఖను సంప్రదించిన తర్వాత లేదా సదరు శాఖ అభ్యర్థన మేరకు మాత్రమే దర్యాప్తు చేస్తారు.
- రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థనపై ప్రజాప్రాముఖ్యం గల కేసులను దర్యాప్తు చేయడం.
- హత్య, కిడ్నాప్, రేప్ వంటి నేరాలపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేయడం.
- జాతీయ, అంతర్జాతీయ ప్రభావం గల వృత్తిపరమైన నేరస్థులు, సంఘటిత ముఠాలు నిర్వహించే నేరపూరిత అంశాల దర్యాప్తు.
- నేర గణాంకాలను తయారుచేయడం, సదరు నేర సమాచారాన్ని ప్రచారం చేయడం.
- అవినీతి నిరోధక సంస్థలు, వివిధ రాష్ట్ర పోలీసు బలగాల కార్యకలాపాలను సమన్వయం చేయడం.

**సీబీఐ విభాగాలు**

1. అవినీతి నిరోధక విభాగం
2. ఆర్థిక నేరాల విభాగం
3. ప్రత్యేక నేరాల విభాగం
4. విధాన, అంతర్జాతీయ పోలీస్ సహకార విభాగం
5. పాలనా విభాగం
6. విచారణ సంచాలకుల కార్యాలయం
7. కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ

## ఇతర అంశాలు

- భారత ప్రభుత్వం 1988లో రూపొందించిన అవినీతి నిరోధక చట్టం అమలుకు సీబీఐ విశేష కృషి చేస్తుంది.
- సీబీఐకి మొదటి డైరెక్టర్‌గా డీపీ కోహ్లి వ్యవహరించారు.
- ప్రస్తుతం సీబీఐ డైరెక్టర్ రిషికుమార్ శుక్లా (2019, ఫిబ్రవరి 2న నియమితులయ్యారు).

## నమూనా ప్రశ్నలు

**1.** ఏ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ చేసిన తీర్మానం ఆధారంగా 'కేంద్ర దర్యాప్తు సంస్థ' (సీబీఐ)ను ఏర్పాటు చేశారు?

1) సాహ్నీ కమిటీ
2) సంతానం కమిటీ
3) నానీపాల్కీవాలా కమిటీ
4) విజయానంద్ కమిటీ

**2.** మనదేశంలో సీబీఐని ఎప్పుడు ఏర్పాటు చేశారు?

1) 1963, ఏప్రిల్ 1
2) 1964, ఏప్రిల్ 1
3) 1962, అక్టోబరు 2
4) 1963, అక్టోబరు 15

**3.** కింద పేర్కొన్న ఏ చట్టం మూలంగా లభించిన అధికారాల ఆధారంతో సీబీఐ పనిచేస్తుంది?

1) పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1941
2) రాష్ట్రపతి ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1952
3) దిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1946
4) శాంతి భద్రతల ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1947

**4.** ఎవరి అధ్యక్షతన గల కమిటీ సిఫార్సుల మేరకు సీబీఐ డైరెక్టర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది?

1) కేంద్ర హోంశాఖ కార్యదర్శి
2) సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్
3) సెంట్రల్ ఇన్‌ఫర్మేషన్ కమిషన్
4) జాతీయ భద్రతా సలహాదారు

**5.** సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ చట్టం, 2003 ప్రకారం సీబీఐ డైరెక్టర్ పదవీ కాలాన్ని ఎన్ని సంవత్సరాలుగా నిర్ణయించారు?

1) 2 2) 3 3) 5 4) 6

**6.** దిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఎవరు వ్యవహరిస్తారు?

1) కేంద్ర విజిలెన్స్ కమిషనర్
2) సీబీఐ డైరెక్టర్
3) జాతీయ భద్రతా సలహాదారు
4) కేంద్ర హోంశాఖ కార్యదర్శి

**7.** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో సీబీఐ అకాడమీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?

1) 1995 2) 1996 3) 1997 4) 1998

**8.** భారత ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించింది?

1) 1988 2) 1986 3) 1985 4) 1984

**9.** కిందివాటిలో సీబీఐ అకాడమీ శిక్షణా కేంద్రం లేని ప్రాంతాన్ని గుర్తించండి.

1) ముంబయి 2) చెన్నై 3) కోల్‌కతా 4) హైదరాబాద్

**10.** సీబీఐకి మొదటి డైరెక్టర్‌గా వ్యవహరించినవారు?

1) కె.ఎం.సాహు 2) సి.కె.త్రిపాఠి 3) డి.పి కోహ్లి 4) అరవింద్ గనేరియా

**11.** ప్రస్తుత సీబీఐ డైరెక్టర్?

1) రిషి కుమార్ శుక్లా 2) అలోక్‌వర్మ 3) నాగేశ్వరరావు 4) విజయానంద్ త్రిపాఠి

**సమాధానాలు:** 1-2; 2-1; 3-3; 4-2; 5-1; 6-2; 7-2; 8-1; 9-4; 10-3; 11-1.

**రచయిత: బంగారు సత్యనారాయణ**